క్లుప్తంగా

పారదర్శకంగా ట్రెజరీ సేవలు



పెదకూరపాడు: పారదర్శకంగా ట్రెజరీ సేవలు అందిస్తున్నట్లు పల్నాడు జిల్లా ట్రెజరీ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా పెద్దకూరపాడు ఖజానా కార్యాలయాన్ని ఆయన శనివారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. ఆయన వెంట ఉపఖజానా అధికారి ఆంజనేయులు ఉన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సత్తెనపల్లి టౌన్ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం పట్టణంలోని ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్, ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, ఎం.సంధ్యారాణి, ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడిగేదెలు మృతి



పెదకూరపాడు: గారపాడు గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో మూడు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. శనివారం గ్రామానికి చెందిన కంకణాల అంకమరాజు, బండ్లమూడి భాస్కర్లకు చెందిన మూడు పశువులను బీడుకు మేత కోసం తరలించారు. తెగిపడిన తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో మూడు గేదలు మృత్యువాత పడ్డాయి. ఒక్కో గేదె ఖరీదు రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించండి



క్రోసూరు: గ్రామంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. క్రోసూరు ఎంపీడీఓ జి.రవికుమార్‌ను శనివారం మండలపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ పి.కోటయ్య, నాయకులు కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో అన్ని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పారిశుద్ధ్య పనులు పటిష్టంగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రోసూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు. అనంతవరం గ్రామ ఎంపీటీసీ గోగిరెడ్డి వేణుగోపాల రెడ్డి, నాయకులు నల్గొండ వెంకయ్య. మేదర రోశయ్య. కడియం రామారావు.పైర్ల చిన్నప్ప ఉన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి

దొడ్లేరు(క్రోసూరు): నేరాల నియంత్రణకే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని క్రోసూరు ఎస్ఐ పి.రవిబాబు అన్నారు. శుక్రవారం రాత్రి క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామస్తులతో పల్లె నిద్ర నిర్వహించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యంగా ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. దాచేపల్లి చందు, మాజీ డీసీ చైర్మన్ దాచేపల్లి సైదా, మొఘల్ జాన్, మాజీ ఎంపీటీసీ చెత్తు బుడే, పూర్ణ చంద్రరావు, పోసిపోగు చిన్న వెంకయ్య, ప్రజలు పాల్గొన్నారు.

రైతులు కోరితే సంతలో మరిన్ని ఏర్పాట్లు

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న పశువుల సంతలో రైతులు, పశుపోషకుల నిమిత్తం పూర్తి వసతులు కల్పించామని, ఇంకా ఏమైనా సమస్యలు గుర్తించి, తమ దృష్టికి తీసుకొస్తే తగు ఏర్పాట్లు చేస్తామని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు అన్నారు. సంతలో అమలు చేస్తున్న సౌకర్యాల గురించి ఆయన శనివారం విలేకరు సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ యార్డులో పశువుల కోసం 11 షెడ్లు, ఒక పెద్ద రూఫింగ్ షెడ్ అందుబాటులో ఉందన్నారు. టింట్‌లు కావాలని రైతులు కోరుతున్నట్లు తమ దృష్టికి రాలేదని, ఎవరైనా రైతులు తన దృష్టికి తెస్తే తప్పక పరిష్కరిస్తామన్నారు. 2024–25 సంవత్సరంలో సంతపై ఏఎంసీకి రూ. 5.56 లక్షల ఆదాయం సమకూరిందని, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1.39లక్షల ఆదాయం వచ్చిందన్నారు. పశువుల కోసం నీటి తొట్లు, వచ్చిన రైతులకోసం మినరల్ వాటర్, పశువుల లోడింగ్ అన్‌లోడింగ్ ఫ్లాట్‌ఫామ్‌లు, సిమెంట్‌రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. రైతులు, పశుపోషకులకు యార్డులో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి కోరారు.

గ్రామాలు..మురికి కూపాలు

- పడకేసిన పంచాయతీ పాలన!
- కనిపించని పారిశుద్ధ్య చర్యలు
- ముందుకు సాగని మురుగు
- రోడ్ల వెంబడే వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు



ముప్పాళ్ళలో సత్తెనపల్లి - నరసరావుపేట ప్రధాన రహదారి వెంబడి వ్యర్థాలు

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో సుపరిపాలన కుంటుపడింది. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుండగా, అధికారులు కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుంచి నేటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందిన దాఖలాలు లేవు. గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టే వారే కరువయ్యారు. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో ప్రకటించిన కార్యక్రమం అమలు కూడా మొక్కుబడిగా ఫొటోలకే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కుదింపు పేరుతో సచివాలయ సేవలు దూరం!

సచివాలయ వ్యవస్థ కుదింపు పేరుతో సేవలను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 11 పోస్టులతో నడుస్తున్న ఈ వ్యవస్థలో పోస్టులను కుదించేందుకు కసరత్తు చేపట్టారు. అందులో భాగంగా ఇప్పటికే ఖాళీగా ఉన్న సచివాలయ ఉద్యోగాల భర్తీపై నేటికీ స్పష్టత లేకుండా పోయింది. దీంతో ఉన్న సిబ్బందే సేవలను అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను ఏడుగురు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో పంచాయతీ కార్యదర్శి రెండు గ్రామాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప గ్రామ సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి.



గోళ్లపాడులో ప్రధాన రహదారిపై పంచాయతీ కార్యాలయం వద్ద నిల్వ ఉన్న మురుగు

మురుగు, వ్యర్థాలమయం..

గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా అధికంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే ఉండటాన్ని జీర్ణించుకోలేని కూటమి నేతలు అధికారుల చేత నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ఇప్పటికే పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి రావాల్సిన బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామ సమస్యలపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామాల్లోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. రోడ్లపైనే మురుగు ప్రవహించి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారు. తేలిక పాటి వర్షం కురిసినా కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు సైతం మురుగు కాల్వలుగా మారిపోతున్నాయి. ఎక్కడ మురుగు అక్కడే నిలిచి తీవ్ర దుర్గంధంతో పాటుగా దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తెచ్చినా కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. డంపింగ్‌యార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఇప్పటికీ ఇళ్లలోని వ్యర్థాలన్నీ రోడ్ల వెంబడే దర్శనమిస్తున్నాయి.

సచివాలయాలను నిర్వీర్యం చేశారు

గ్రామాల్లో మెరుగైన సేవలందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి నేతలు పాలన సాగిస్తున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను దిష్టిబొమ్మలా మార్చారు. కార్యాలయాల్లో సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు, సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కనీసం మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లే వారే కరువయ్యారు.

–రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు, చాగంటివారిపాలెం

మురుగుకాల్వలను శుభ్రం చేయిస్తాం

గ్రామాల్లోని మురుగు కాల్వలన్నీ శుభ్రం చేయించేలా చర్యలు చేపడతాం. ఇళ్లలోని వ్యర్థాలను సేకరించేందుకు చర్యలు చేపట్టి సిబ్బందిని నియమించాం. ప్రతి గ్రామంలోను చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని గ్రామాల్లో వ్యర్థాలన్నీ రోడ్ల వెంబడే వేస్తున్నారు. ఫాగింగ్ చర్యలు కూడా చేపట్టాం. మరో మారు పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.

–ఎస్.రూపవతి, ఈఓపీఆర్డీ, ముప్పాళ్ల

పెన్షనర్స్ అసోసియేషన్ అభివృద్ధికి వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ రిటైర్డ్ హెచ్‌ఎం పాతూరి అనంతరామయ్య చిత్రపటం శనివారం ఆవిష్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రిటైర్డ్ అధ్యాపకుడు పాతూరి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై అనంతరామయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతరామయ్య కుమారులు వారి తండ్రి జ్ఞాపకార్థం రూ. 51,116 నగదును పెన్షనర్స్ అసోసియేషన్ అభివృద్ధి నిమిత్తం అందజేశారు. అనంతరామయ్య చిత్రపటానికి అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ కేబీఆర్ట్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరామయ్య సేవలను గద్దె మురహరిరావు, కోటగిరి పోతులూరయ్య, జగన్నాథ నాయుడు కొనియాడారు. భాస్కరరావును పెన్షనర్స్ శాలువాతో సత్కరించారు. కొండ్రు వెంకట్రావు, సుబ్బారావు, రామచంద్రరావు, చంద్ర య్య, నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు, విజయకుమార్, ఖాదర్ వలీ, మోహిద్దీన్, రామకోటయ్య, వాసు, చంద్, శృంగారం, నరసింహారావు, బీడీఆర్, పంచుమర్తి సుబ్బారావు, అరవ రమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్ర పరిసరాలే ఆరోగ్య కవచాలు

సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ‘స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర’

సత్తెనపల్లి: మన చుట్టూ ఉండే పరిశుభ్ర పరిసరాలే మన ఆరోగ్యానికి రక్షణ కవచాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వచ్ఛందంగా చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జ్యోతి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని హెల్ప్ ఫౌండేషన్, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల విద్యార్థులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను, రైల్వేస్టేషన్‌లో ఉన్న మంచినీటి కొళాయిలను శనివారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ జ్యోతి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాతావరణంలో పెరుగుతున్న వేడిని తగ్గించడానికి ప్రతి ఒక్క రూ మొక్కలు నాటాలన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని, స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. హెల్ప్‌ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రతి నెల స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో తాము కూడా పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా మొక్కలు నాటి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రమేష్, రైల్వేస్టేషన్ సిబ్బంది, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో ‘బీట్ ది హీట్’

సత్తెనపల్లి: ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో చేపట్టిన బీట్ ది హీట్ కార్యక్రమం విజయవంతమైంది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, గార్లపాడు సెంటర్, కట్టమూరివారివీధి, గడియార స్తంభం సెంటర్ మీదుగా తాలూకా సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి తాలూకా సెంటర్లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వేసవి తీవ్రతను తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా వడగాలుల నుంచి రక్షణ పొందాలన్నారు. వేసవి నుంచి ఎలా కాపాడు కోవాలో ప్రజలకు వివరించారు. మున్సిపల్ డీఈ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, టీఎంసీ ఖాజావలి, శానిటేషన్ సెక్రటరీలు, మెప్మా మహిళలు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో బీట్ ది హీట్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

గుండ్లపల్లిలో...

నకరికల్లు: వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయం నుంచి మెయిన్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటి స్వచ్ఛాంధ్ర ప్రతి/ చేశారు. గ్రామస్తుల సహకారంతో హరిత రాయబారులకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌డబ్ల్యూపీ షెడ్‌ను సందర్శించి తడిచెత్త – పొడిచెత్త ఇళ్ల వద్దనే వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సేకరించిన వ్యర్థాలతో వర్మికంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు అందించాలన్నారు. ఇన్‌చార్జి విస్తరణాధికారి కొమ్మవరపు అప్పారావు, గ్రామ కార్యదర్శి షేక్.నూరుల్లా నబి, జూపల్లి మోషె, కరాలపాటి వలి, చింతపల్లి ఫకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సత్తెనపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిసరాలను శనివారం నాయకులతో కలిసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లా డుతూ ప్రతి ఒక్క చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

సత్తెనపల్లి: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ పంచాయతీలో బీట్ ద హీట్ అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రతకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, చలువ పందిర్లు ఏర్పాటు, పశువుల తొట్లు, చలివేంద్రాలు ఏర్పాటు, ర్యాలీ నిర్వహణ జరిగింది. అనంతరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్, ఐటీసీ రిసోర్స్ పర్సన్ చెంబేటి బోల్లయ, సచివాలయం సిబ్బంది, వార్డ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ జి.కాశయ్య, అధికారులు, గ్రామస్తులు

బెల్లంకొండలో...

బెల్లంకొండ: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ శ్రీనివాస నాయక్ తెలిపారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు వీధులు శుభ్రంగా ఉంచడం పంచాయతీ సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రజలతో స్వచ్ఛత దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్డీ వెంకటగిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీబాయి, ఏఎన్‌ఎం వాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుల త్యాగం శ్లాఘనీయం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్
- ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సత్తెనపల్లిలో తిరంగా ర్యాలీ

సత్తెనపల్లి: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌కు రెండు రోజుల్లోనే ముచ్చెమటలు పట్టించి ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైనికుల వీరోచిత త్యాగం శ్లాఘనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కన్నా కార్యాలయం నుంచి ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావం తెలియజేస్తూ కూటమి నేతలు తిరంగా యాత్ర శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మలపాటి శ్రీధర్ మాట్లాడుతూ మహిళల నుదుటిన సిందూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో త్రివిధ దళాలు బదులిచ్చాయన్నారు. అన్ని రంగాల్లో దేశం దూసుకు పోతుందనే అసూయతోనే పాకిస్తాన్ కుట్రలు చేస్తుందన్నారు. భారత్ పైకి ఉగ్ర వాదులు కన్నెత్తి చూడకుండా సైన్యం జవాబు ఇచ్చిందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనికుల ధైర్య సాహసాలు భావితరాలకు ఆదర్శమన్నారు. ముందుగా యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు అశ్రునివాళులర్పించి, ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయప్రకాష్, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, మహిళా నాయకురాలు భీమినేని వందనాదేవి పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కొమ్మాలపాటి, కూటమి నాయకులు

వైభవంగా బాలయేసు దేవాలయ పునఃప్రతిష్ట

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో బాలయేసు దేవాలయ పునఃప్రతిష్టా వేడుకలలో భాగంగా శనివారం రాత్రి జరిగిన జూబిలీ ఆరంభ కృతజ్ఞతార్పన సమష్టి దివ్యపూజాబలి గీతాంజలి కార్యక్రమంలో నెల్లూరు మేత్రాసనం మహాఘన రెవ.డాక్టర్ పిల్లి అంథోనిదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్కడో జర్మనీ నుంచి ఇక్కడకు వచ్చిన స్వామి అర్లానంద, సుమారు 130 సంవత్సరాల క్రితం తాళ్లచెరువు గ్రామాన్ని సృష్టించడం చాలా గొప్పవిషయం అన్నారు. ఇక్కడ నివశించే వారందరికీ క్రైస్తవమతాన్ని ప్రబోధించి 1950లో బాలయేసు మందిరాన్ని నిర్మించడం ఒక అద్భుతం అన్నారు. ఆ దేవాలయం దినదినాభివృద్ధి చెంది నేడు మహాదేవాలయంగా పునఃప్రతిష్ట కార్యక్రమం జరుపుకోవడం ఆనందించదగిన విషయం అన్నారు. దేవాలయం నిర్మించి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామస్తుల సమష్టి కృషితో వజ్రోత్సవ జూబిలి వేడుకలు చేసుకోవడం, దేవాలయాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుకోవడం అభినందనీయమన్నారు. జూబిలీ వేడుకలు అంటే ఇచ్చి పుచ్చుకోవడం, పరస్పరం అభినందించుకోవడం, గౌరవ భావం కలిగి ఉండటం, ప్రేమ, దయ, జాలి కలిగి ఉంచి అందరూ సమానమేనని తెలుసుకోవడం అన్నారు. దేవుని దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో 50మంది ఫాదర్లు, మరో 50మంది కన్యాస్త్రీలు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చిన గురువులు తమ సందేశాన్ని ఇచ్చారు. దేవాలయం విచారణ గురువులు పుట్టి అంథోనిరాజు ఆధ్వర్యంలో ప్రారంభ వేడుకలు అద్భుతంగా జరిగాయి. సుమారు మూడువేలమంది భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలి వచ్చారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వాక్యసందేశం అందిస్తున్న రెవ.డాక్టర్ పిల్లి అంథోని దాస్

చలివేంద్రం ప్రారంభం

పెదకూరపాడు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడులో చైతన్య సమితి ఆధ్వర్యంలో రేపల్లెకు చెందిన కంచర్ల శౌరిబాబు 7వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో శనివారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొమ్మాల పాటి శ్రీధర్ ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉడుముల వెలుగొండారెడ్డి పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో భూసమీకరణ సభలు

అమరావతి: అమరావతి రాజధాని కోసం రెండవ విడత భూసమీకరణ కోసం మండల పరిధిలోని ఉంగుటూరు, నరుకుళ్ళపాడు, నెమలికల్లు, మండెపూడి గ్రామాల్లో శనివారం గ్రామసభలు జరిగాయి. ఆయా సభల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ గ్రామసభలకు తహసీల్దార్ డానియేల్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ భూసమీకరణ ప్రక్రియపై రైతులకు భూసమీక రించే విధానాలు, పరిహారాలు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి భూసమీకరణ కీలకమని భవిష్యత్ తరాల కోసం అమరావతి నిర్మాణంలో రైతులు భాగస్వాములు కావాలన్నారు. ఈసందర్భంగా రైతులు తమకు ప్లాట్లు ఎక్కడ ఇస్తారు? రోడ్డు పక్కన ఖరీదైన ప్లాట్లకు ప్రత్యేకమైన రాయతీలు ఉంటాయా? ప్లాట్లు ఇవ్వటం ఆలస్యమైతే పరిస్థితి ఎంటి? తమ భూముల్లో ఏమైనా కట్టడాలు కడతారా లేక పరిశ్రమలు వస్తాయా? కౌలు ఎలా ఇస్తారు? తమ గ్రామంలోనే ప్లాట్లు ఇస్తారా..వేరే చోట ఇస్తారా.. వంటి అనుమానాలను వ్యక్తం చేశారు. వాగులల్లో ఉన్న భూములు, ధర తక్కువ భూముల రైతులు భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని, అయితే ధర అధికంగా పలికే భూములు, రోడ్డు పక్క భూముల రైతులు వారి అభిప్రాయాలను బయటకు చెప్పటం లేదని వినికిడి. అలాగే నెమలికల్లు గ్రామంలో కొంతమంది రైతులు గ్రామసభకు రాలేదు. ఈగ్రామసభల్లో ఇన్‌చార్జి ఆర్డీఓ కుమార్, ఎంపీడీఓ పార్వతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఉంగుటూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం: ప్రభుత్వ నిబంధనల మేరకే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తహసీల్దార్ దుర్గేష్‌రావు శనివారం తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబం కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ విభనలో భాగంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నారన్నారు. గతంలో ఉన్న కార్డులో తప్పొప్పులు ఉంటే సరిచేసుకోవచ్చని తెలిపారు. చనిపోయిన వారి పేర్లను తొలగిస్తామని తెలిపారు. బియ్యంకార్డు కలిగి ఆధార్‌కార్డులో తప్పు ఉంటే సరిచేసుకోవచ్చని తెలిపారు.

కొత్త రేషన్ కార్డులపై అవగాహన కల్పించాలి

ముప్పాళ్ళ: కొత్త రేషన్ కార్డులపై ప్రతి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందేలా చూడాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ దుకాణాల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 30 దుకాణాలకు గాను సుమారు 3వేలవరకు కొత్త రైస్‌కార్డులకు దరఖాస్తులు అందేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోను అవగాహన కల్పిస్తూ గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. దుకాణాల వద్ద వివరాలు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణదారులు కార్డుదారులకు అందుబాటులో ఉండాలని, ప్రతి కార్డుదారునికి సరుకులు అందించాల్సిందేనన్నారు. రీ సర్వేపై సర్వే సిబ్బందితోను సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ ఆంజనేయులు, మండల సర్వేయర్ సుధాకర్, ఆయా గ్రామాల వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.భవానీశంకర్

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

బెల్లంకొండ: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ, నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలను చిత్తుచేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు బైరాపట్నం రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మన్నెసుల్తాన్ పాలెంలో శనివారం సీపీఐ గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల సమస్యల కోసం పోరాడడమే సీపీఐ లక్ష్యం అన్నారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పి.వెంకట్రావు, గ్రామ కార్యదర్శి కరీముల్లా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరాపట్నం రామకృష్ణ